


ప్రధానికి జ్ఞాపికను అందజేస్తున్న బీజేపీ నేతలు


మాట్లాడుతున్న బండి సంజయ్

కమలోత్సాహం

- వేములవాడలో మోదీ సభ సక్సెస్‌తో బీజేపీలో జోష్
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- రాజన్న ఆలయంలో 30 నిమిషాలు గడిపిన ప్రధాని
- బండి సంజయ్ విజయం ఖాయమైందని అనడంతో హోరెత్తిన సభ

● రాజన్నకు పూజలు, కోడె మొక్కు

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం వేములవాడకు వచ్చిన ఆయన రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వద్దకు చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామిని, రాజరాజేశ్వరస్వామి వారిని, రాజరాజేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, నమిలికొండ ఉమేష్‌శర్మ ప్రధాని మోదీకి స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు.

సిరిసిల్ల/వేములవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నా యకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతు తెలప డంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగిసు్తన్నంత సేపూ చప్పట్లు కొట్టి ఉత్సాహం కనబరిచారు. బుధవారం ఎన్నికల వేములవాడ జన బహిరంగ సభకు వచ్చిన ప్రధాన మంత్రి మోదీకి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో పూజ, దర్శనం అనంతరం బహిరంగ సభ వద్దకు మోదీ చేరుకున్నారు. ప్రధాని ప్రసంగాన్ని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అనువదించారు.

● ఉదయం 10 గంటలకే ఇంత జనమా..

సభ ఉదయం 10 గంటలకే జరిగినా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంపై మోదీ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గుజరాత్‌లో మూడు సార్లు సీఎంగా పని చేసినా, ఎన్నో ఎన్నికలు చూసినా, ఇంత ఉదయమే పెద్ద ఎత్తున్న ప్రజ లు తరలిరావడం ఎక్కడా చూడలేదన్నారు. బండి సంజయ్‌ని చేయి పట్టి అభినందించారు.తమపై చూపిస్తున్న ప్రేమాభిమానానికి శిర స్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విజయం ముం దే ఖాయమైందన్నారు.

నా తెలంగాణ కుటుంబ సభ్యులకు నమస్కారం

ప్రధాన మంత్రి 'నా తెలంగాణ.. కుటుంబ సభ్యులకు నమస్కారాలు' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు.దీంతో సభకు హాజరైన ప్రజలు కేరింతలు, చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు. దక్షిణ కాశీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని మీ ఆశీర్వాదం కోసం వచ్చానని మోదీ కోరారు.

● కట్టుదిట్టమైన భద్రత

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా పోలీసులు వేములవాడలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అడుగుఅడుగునా చెక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌జీ, భద్రతా బలగాలు, పోలీసులు 1200 మందితో బందోబస్తు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహించాయి.


ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అభ్యర్థులు

● కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

ప్రధాని నరేంద్రమోదీ తన ప్రసంగంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై మాట్లాడిన ఆయన కాంగ్రెస్ సరైన దర్యాప్తు జరగకుండా బీఆర్ఎస్‌ను కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలు, సిండికేట్ పార్టీలేనని అ న్నారు. కరీంగనర్‌లో బండి సంజయ్ విజయం ముందే నిర్ణయమైందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గురించి ఎవరికీ తెలియదన్నారు. పీవీ నరసింహారావును కాంగ్రెస్ తీవ్రంగా అవమానించిందని విమర్శించారు. పీవీకి భారతరత్నతో గౌరవించిన ఘనత బీజేపీదేనని తెలిపారు. 13న కాంగ్రెస్, బీఆర్ఎస్ పాపాల లెక్కను తేల్చాలని, కరీంనగర్ నుంచి బండి సంజయ్, అదిలాబాద్ నుంచి గోడెం నగేష్, పెద్దపల్లి నుంచి గొమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. సభకు రాలేని వారికి వచ్చిన వారు తన తరఫున నమస్కారం చెప్పాలని కోరారు.

పర్యటన సాగిందిలా..

- ఉదయం 9.20: హెలీక్యాప్టర్‌లో వేములవాడకు చేరుకున్నారు.
- 9.25: రాజరాజేశ్వరసామి ఆలయానికి చేరుకున్నారు. 30 నిమిషాలసేపు ఆలయంలో పూజలు నిర్వహించి కోడె మొక్కు చెల్లించుకున్నారు.
- 10.10: బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.18 నిముషాలకు తిరుగు ప్రయాణం.

ప్రధాని సభ సైడ్‌లైట్స్

- ప్రధాని పర్యటన సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో నాలుగు హెలికాప్టర్లు దిగడంతో జనం వాటిని ఆసక్తిగా చూస్తూ సెల్‌ఫోన్లలో బంధించారు.
- ఆలయానికి చేరుకున్న ప్రధానికి పూర్ణకుంభంతో ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. ప్రధానమంత్రి ఆలయంలో దాదాపు 30 నిముషాల పాటు గడిపారు. అర్చకులు మోదీకి రాజన్న ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.
- వేములవాడ బైపాస్ రోడ్డులో వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక మీదికి రాగానే ప్రజలు పెద్దఎత్తున మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు.
- ప్రధాని 42 నిముషాలపాటు ప్రసంగించారు.
- సభ తర్వాత జనాలు ఒక్కసారి రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ స్తంభించింది.

● పరిమిత సంఖ్యలో భక్తులకు అనుమతి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలయ సందర్శన నేపథ్యంలో బుధవారం ఉదయం భక్తులను, అర్చకులను, సిబ్బందిని పరిమిత సంఖ్యలో ఆలయంలోకి అనుమతించారు. మోదీ ఆలయంలోకి ప్రవేశించిన సమయంలో సర్వదర్శనం నిలిపివేశారు.

● రాజన్నను దర్శించుకున్న తొలి ప్రధాని

రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న తొలి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర మంత్రులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నప్పటికీ దేశంలోనే అత్యున్నత పదవి అయిన ప్రధాన మంత్రి హోదాలో ఉన్న వారెవరూ వేములవాడను సందర్శించలేదు.

రాజకీయాల కోసమే మోదీ పర్యటన

- వేములవాడ రాజన్న గుడికి నయా పైసా ఇవ్వలేదు
- ఎంపీగా బాధ్యతలను విస్మరించిన బండి సంజయ్
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న
బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మే 8: వందల కోట్లతో వారణాసిని అభివృద్ధి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజన్న గుడికి నయాపైసా ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. మోదీ రాజకీయాల కోసమే తప్పా వేములవాడ రాజన్న గుడి అభివృద్ధి కోసం, ఈ ప్రాంత ప్రజల కోసం రాలేదని విమర్శించారు. ప్రధాన మంత్రి వందల ఏళ్ల చరిత్ర ఉన్న వేములవాడ దేవస్థానం గురించి మాట్లాడక పోవడం శోచనీయమని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలను ఒక సర్క్యూట్ చేయాలని, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని గతంలో కోరామన్నారు. మోదీ సర్కార్ అందుకు ఒప్పుకోలేదన్నారు. రాజన్న గుడిని బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చేశామని వినోద్‌కుమార్ చెప్పారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేసే ఎంపీ బండి సంజయ్ కుమార్ రాజన్న గుడికి నిధులు ఇవ్వాలని ఎందుకు ప్రధానిని అడగలేదని ప్రశ్నించారు. ఎంపీగా తన బాధ్యతలను బండి సంజయ్ పూర్తిగా విస్మరించారని వినోద్‌కుమార్ విమర్శించారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదనే అసహనంతో ప్రధాని మోదీ నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. 2006లో సుప్రీం కోర్టు జస్టిస్ బాలకృష్ణ రిజర్వేషన్లను ముట్టుకునే వీలు ఎవరికి లేదని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రిజర్వేషన్లను అడ్డు పెట్టుకుని కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని, ఎస్సీ, ఎస్టీలను రాజకీయాలకు వాడుకోవద్దని హెచ్చరించారు. మరోసారి తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని వినోద్‌కుమార్ కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, టి భానుప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, అక్బర్ హుస్సేన్, పన్యాల భూపతిరెడ్డి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నవాజ్, వాజిద్, సాయికృష్ణ, కుల్‌దీప్‌వర్మ, సంపత్‌గౌడ్, మోహన్, హరిప్రసాద్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.


మానకొండూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

● బండి సంజయ్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు..

మానకొండూర్: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఐదు పైసల అభివృద్ధి పనులు చేయలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మానకొండూర్‌లో బుధవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడకు ప్రధానమంత్రి రావడం సంతోషకరమని, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఎందుకు హామీ ఇవ్వలేదో బీజేపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఆదరించి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

రాజకీయ వేడి రగిల్చిన మోదీ

- కరీంనగర్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ప్రకటన
- భగ్గుమన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'కరీంనగర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ విజయం మీరు ముందే ఖాయం చేశారు. కాంగ్రెస్ పార్టీ పక్కాగా ఓడిపోనున్నది. అతికష్టం మీద ఆ పార్టీ ఎవరో అభ్యర్థిని ఎన్నికల పోరులోకి దించింది. ఇక బీఆర్ఎస్‌కు అతిగతీ లేదు' అని వేములవాడలో జరిగిన బీజేపీ జనసభలో ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగం జిల్లాలో, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో రాజకీయ వేడిని రగిల్చింది. ప్రధాని జిల్లాకుగానీ, వేములవాడకుగానీ చేసిందేమి లేదని ఆయన ప్రసంగం పూర్తిగా రాజకీయ ప్రసంగమని, అబద్ధాలతో నిండి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ప్రధాని ప్రసంగం బీజేపీ నేతల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఆగ్రహం కలిగించింది. గురువారం కరీంనగర్‌లో జరుగనున్న కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయడం ద్వారా మోదీకి బీఆర్ఎస్ అడ్రస్ ఉందో.. లేదో తెలియజేయాలని చూస్తున్నామని ఆ పార్టీ నేతలు వాఖ్యానించారు.

● వేములవాడకు చేసిందేంటో చెప్పాలి..

మోదీ బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని పేర్కొన్న అంశాన్ని రాజకీయ ప్రసంగంగా భావిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఆయనపై అభివృద్ధి అస్త్రాలను ఎక్కుపెట్టారు. దక్షిణ కాశీగా పేర్కొన్న వేములవాడకు మోదీ చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధికిగానీ, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏమి చేస్తారో హామీ ఇవ్వలేదని ఎద్దేవా చేస్తున్నారు. దక్షిణ కాశీకి వచ్చిన ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ అని ప్రశంసించిన బండి సంజయ్ కుమార్ కూడా రాజన్న దేవాలయ అభివృద్ధికి, ఇతర దేవాలయాలకు నిధులు ఇవ్వాలని ఎందుకు అడగ లేదని వారు ప్రశ్నించారు. మోదీ ప్రసంగంపై రాజకీయ విమర్శలు వచ్చినా పోలింగ్‌కు మరో నాలుగు రోజుల గడువు మాత్రమే ఉన్న సమయంలో జరిగిన వేములవాడ బీజేపీ జనసభ రాజకీయ పక్షాల్లో ఎన్నికల వేడిని రగిల్చింది. ఉదయం 10 గంటలకే ప్రారంభమైన సభకు మోదీ రాకకు ముందే వేలాదిగా ప్రజలు తరలిరావడం వారిని చూసి తాను నాయకత్వం వహించిన గుజరాత్‌లోనూ ఇలాంటి సభను చూడలేదని మోదీ వాఖ్యానించారు.

రాజన్నసాక్షిగా మోదీ అబద్ధాలు చెప్పారు...

- కరీంనగర్‌కు చేసిన అభివృద్ధి ఏమిటి
- మంత్రి పొన్నం ప్రభాకర్


వేములవాడలో ప్రచారం చేస్తున్న పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 8: కరీంనగర్ అభివృద్ధికి ఏమి చేశారని తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ప్రధాని మోదీ వేములవాడ వచ్చి రాజన్న సాక్షిగా అబద్ధాలు చెప్పి వెళ్లిపోయాడని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 10 ఏళ్లలో ప్రధాని మోదీ ఎప్పుడూ వేములవాడకు రాలేదని, అలయానికి నిధులు ఇవ్వలేదని, అభివృద్ధిపై హామీ ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క ఓటుతో కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశామన్న మోదీ.. అక్కడ శాంతి నెలకొంటే బీజేపీ ఎందుకు ఎన్నికల్లో పోటీ చేయలేదని ప్రశ్నించారు. కశ్మీర్‌లో మూడు ఎంపీ సీట్లు ఉంటే ఒక్కసీటులో కూడా బీజేపీ అభ్యర్థిని పోటీ పెట్టనది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రజలు వేసిన ఒక్క ఓటుతో భారతదేశం డిఫెన్స్ విభాగంలో ఆయుధాల దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసుకునే స్థాయికి ఎదిగిందని మోదీ చెబుతున్న అబద్దాలకు హద్దు లేదన్నారు. ఆయుధాలను దేశం ఇంకా దిగిమతి చేసుకుంటుందని తెలిపారు. రక్షణశాఖకు కేటాయించే బడ్జెట్ 5 లక్షల కోట్లు అయితే తీసుకున్న 130 లక్షల కోట్ల రుణాలకు 10 లక్షల కోట్లు వడ్డీని దేశం చెల్లిస్తోందన్నారు. రాజకీయాల కోసం రక్షణ బలగాలను వాడుకున్న ద్రోహి మోదీ అని విమర్శించారు. వ్యవసాయ, ఆర్థిక, టెక్స్‌టైల్ రంగాల్లో కాంగ్రెస్ ఎలాంటి న్యాయం చేయలేక పోయిందని మోదీ చేసిన వ్యాఖ్యలు అబద్ధమన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు 1300 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వాలు నాలుగు లక్షల మెగా వాటకు పెంచన్నారు. 40 కోట్ల ఎకరాలను సాగుకు అనుకూలంగా మార్చామని మంత్రి తెలిపారు. దేశ స్వాతంత్ర సమయంలో దేశ బడ్జెట్ 190 కోట్లు మాత్రమేనని, 2014 నాటికి బడ్జెట్‌ను 30 లక్షల కోట్లకు పెంచడం కాంగ్రెస్ ఘనత కాదా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదని, పింఛన్లు ఒక్కపైసా పెంచలేదని విమర్శించారు. బీజేపీ పాలనలో అదానీ, అంబానీలు తప్ప ఎవరూ బాగు పడలేదన్నారు. కుటుంబ పార్టీలు అంటూ ఆడిపోసుకుంటున్న బీజేపీ య డ్యూరప్ప మొదలుకొని రాజ్‌నాథ్‌సింగ్ కొడుకు వరకు చాలా మందికి టికె ట్లు ఇచ్చిందని, నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి వారసుడు కాదా అన్నారు. పీవీ నరసింహారావు విద్యార్థి నుంచి దేశ ప్రధానిగా ఎదగడానికి కాంగ్రెస్ కారణమని స్వయంగా ఆయనే చెప్పారని తెలిపారు. ఈడీ, సీబీఐ విచా రణ జరుగుతున్న నేతలు బీజేపీలో చేరితే పునీతులవుతారా అని ప్రశ్నిం చారు. ఆదర్శస్కాం ఆద్యుడు అశోక్‌చవాన్‌కు రాజ్యసభ సీటు, కోల్‌స్కాం కింగ్‌పిన్ మధుకోడాకు లోక్‌సభ టికెట్, 70 వేల కోట్ల ఇరిగేషన్ స్కాంలో ఉన్న అజిత్‌పవార్ భార్యకు లోక్ సభ సీటు, ఢిల్లీ లిక్కర్ స్కాం అప్రూవర్ మాగుంట శ్రీనివాస్‌రెడ్డికి లోక్‌సభ సీటు, ఆంధ్రా మాల్యాలుగా పేరున్న సీఎం రమేష్ ఎంపీ, సుజనాచౌదరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని విమర్శించారు.

● మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి వేములవాడ, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికల్లో వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పెంపు

- రేపటి వరకు ఓటు వేసే అవకాశం

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో రెండు రోజుల గడువు పెంచిందని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 వ తేదీ వరకు మొదట గడువు ఉండగా, 10 వరకు ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవ కాశం కల్పించిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు. కరీం నగర్ లోని సెయింట్ అల్ఫోన్స్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాలని కలెక్టర్ తెలిపారు.

ధాన్యం కొనుగోలులో జాప్యంపై
రైతుల నిరసన

చందుర్తి, మే 8: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు బుధవారం చందుర్తిలో నిరసన తెలిపారు. చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, చందుర్తికి చెందిన రైతులు ధాన్యం జాప్యాన్ని నిరసిస్తూ చం దుర్తి సింగిల్ విండో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయంకి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య మాట్లాడుతూ మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యిం దన్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి నెలరోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు 50 శాతం వరకు దళారులే రైతుల ధాన్యం తూకం వేశార న్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించి కొనుగోలు కేంద్రాల్లో సీరియల్‌గా, ధాన్యం సక్రమంగా తూకం వేయడం లేదన్నారు. చందుర్తి సింగిల్ విండో ఛైర్మన్‌ను, సిబ్బందిని అడిగితే లారీల కొరతతో ధాన్యం కొను గోలు ఆలస్యం అవుతుందని సమాధానం ఇస్తున్నారన్నారు. జిల్లా అధికారుల తో మాట్లాడితే ప్రతి రోజూ 15 లారీలలో ధాన్యం తరలిస్తూ, ధాన్యం తూకం వేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు తప్ప, కొనుగోలు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, లేనిచో రైతులు రోడ్డుపై ధర్నా చేయక తప్పదన్నారు. అవసరమనుకుంటే చలో కలెక్టర్ చేపడతామ న్నారు. సంచికి 41,600 చెప్పి కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నార న్నారు. ధాన్యం తూకం వేసిన లారీకి 240 క్వింటాలు తరుగు పేరున కటింగ్ చేస్తున్నారన్నారు. చందుర్తికి చెందిన బత్తుల వసంతరావు అనే రైతుకు 80 కిలోలు, మర్రి నిశాంత్ అనే రైతుకు చెందిన ధాన్యం 80 కిలోలు, బత్తుల సూర్యరావు 80 కిలోలు కటింగ్ చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దేవారెడ్డి సత్తిరెడ్డి, తిప్పని శంకర్, తిప్పని గంగయ్య, గుమ్మ శంకర్, దుమ్ము నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఆర్ఎంపీ వైద్యులకు విందు..
ఎన్నికల అధికారుల విచారణ

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు హుజూరాబాద్ మండలంలోని ఆర్ఎంపీ వైద్యులకు విందు ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన కార్యకర్తలు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల ఫ్లాయింగ్ స్క్వాడ్, పోలీసులు సదరు ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకున్నారు. ఇది గమనించిన ఆర్ఎంపీ వైద్యులు, విందు ఇచ్చిన సదరు రాజకీయ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఎన్నికలాధికారులు అడ్డుకొని విచారించారు. సదరు ఆర్ఎంపీ వైద్యులు ఎన్నికలాధికారులు నిలదీయగా, బర్త్‌డే ఫంక్షన్‌కు వచ్చామని తెలిపారు. బర్త్‌డే ఫంక్షన్ చేసుకుంటే ఎన్నికలాధికారి అనుమతి తీసుకోవాలని ఎన్నికలాధికారులు ప్రశ్నించారు. ఈ లోగానే ఆర్ఎంపీ వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా అప్పటికే ఆర్ఎంపీ వైద్యులకు గ్రామాల్లో ప్రచారం చేయడానికి నజరానా ముట్టజెప్పినట్లు తెలిసింది. గత నాలుగు రోజుల క్రితం కూడా ప్రైవేట్ టీచర్లకు ఈ ఫంక్షన్ హాల్‌లో విందు ఇచ్చినట్లు తెలిసింది. పూర్తి నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వను న్నట్లు ఫ్లాయింగ్ స్క్వాడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, మే 8: గంగాధర గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్‌కు విద్యుత్ ఘాతంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర పంచాయతీలో షహీద్ పాషా విద్యుత్ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బుధవారం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడానికి విద్యుత్ సిబ్బంది షహీద్‌ను తీసుకెళ్లారు. కాగా సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్న లైన్‌మెన్ జంపర్ మార్పిడి చేయడానికి షహీద్‌ను స్తంభం ఎక్కించారు. రాంగ్ ఎల్‌సీతో షహీద్ విద్యుత్ షాక్‌తో కిందపడిపోయాడు. దీంతో అతడి కుడి చేయి నరాలు పూర్తితెగిపోయినట్లు సమాచారం. క్షతగాత్రుడిని కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని తెలిసింది. దీనిపై ఏడీని వివరణ కోరగా సబ్ స్టేషన్ ఆపరేటర్, లైన్ మెన్ కమ్యూనికేషన్ లోపంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, మే 8: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లవేని శ్రీనివాస్ రోజులాగే తన పొలం వద్ద లేగ దూడను కట్టేసి ఉంచాడు. మంగళవారం రాత్రి లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. 40 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

తిమ్మాపూర్‌లో అగ్ని ప్రమాదం
- గుడిసె, పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ శివారులోని మైసమ్మ చెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. రైతులు అల్లె ముత్తయ్య, ప్రదీప్, కొల కాని లక్ష్మయ్య, రవి, శ్రీనివాస్‌కు చెందిన సుమారు 100 గడ్డి కట్టలు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిపోయాయి. అల్లె ముత్తయ్య, ప్రదీప్‌కు చెందిన గుడిసెతోపాటు అందులోని సామగ్రి దగ్ధమయ్యాయి. చుట్టు పక్కల రైతులు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. అధికారులు నష్టం అంచనావేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రమా దం జరిగిన తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవా లని మాజీ ఏఎంసీ ఛైర్మన్, అందె సుభాష్, బీఆర్ఎస్ నాయకులు అనిల్, శంకర్, శేఖర్ సతీష్ కోరారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మే 8: చదువుకోమంటూ తల్లి మందలించడంతో కూతురు ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన శ్రీనిధి ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతోంది. హైదరాబాద్ వెళ్లి పరీక్ష రాయాల్సి ఉందని, సెల్‌ఫోన్‌తో కాల క్షేపం చేయవద్దంటూ తల్లి పద్మ కూతురును మందలించింది. అనంతరం ఆమె పనికి వెళ్లింది. ఇంట్లో ఉన్న శ్రీనిధి తల్లి మాటలకు మనస్థాపం చెంది తన ఎడమ చేయి మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిఫా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొలగాని శ్రీనివాస్



నిఫా కార్యవర్గసభ్యులతో కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, మే 8: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్ (నిఫా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌లోని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ నియామకమయ్యారు. ఢిల్లీలో జరిగిన నిఫా జాతీయకార్యవర్గ సమావేశంలో కొలగాని శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు స్వచ్ఛంద, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ నిఫా ఆర్గనైజేషన్‌లో భాగస్వామినైనందుకు సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన నిఫా జాతీయ నాయకత్వానికి కృతజ్ఞ తలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిఫా ఆధ్వర్యంలో స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తానన్నారు. నిఫా జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు.

మద్యం పట్టివేత

మానకొండూర్, మే 8 : మానకొండూర్ మాజీ సర్పంచు పృథ్వీరాజ్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బుధవారం రాత్రి పట్టుకున్న ట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ సమాచారం మేరకు పృథ్వీరాజ్ ఇంటిపై దాడి చేయగా 48 రాయల్ స్టాగ్ క్వాటర్స్, 22 బీర్లు లభ్యమైనట్లు సీఐ తెలిపారు. మద్యం విలువ రూ. 15 వేలు కాగా వాటి ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సజావుగా ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు



తిమ్మాపూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, మే 8: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షల బుధవారం జిల్లాలో రెండో రుజూ సజావుగా జరిగాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకే సెషన్‌లో జరిగింది. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించారు. 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,931 మంది విద్యార్థులకు గానూ 2,738 మంది హాజరయ్యారు. మొత్తంగా 93.42శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళ, బుధ వారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం పరీక్షలు జరిగాయి. కాగా 9,10,11 తేదీల్లో మూడు రోజుల పాటు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తిరిగి మధ్నాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు.

స్వగ్రామం చేరిన యువకుడి మృతదేహం

బీర్‌పూర్, మే 8: గల్ఫ్ దేశంలో చికిత్స పొందుతూ మృతిచెందిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బంద్ర రాజేష్(30) అనే యువకుడు కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయికి వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఏప్రిల్ 27న దుబాయ్‌లో మృతి చెందాడు. రాజేష్ మృతదేహం గ్రామానికి రావడంతో రాజేష్ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

జగిత్యాలలో వైద్యుల ఆందోళన



మాట్లాడుతున్న తాటిపాముల సురేష్

జగిత్యాల టౌన్, మే 8 :జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుడు శ్రవణ్, సిబ్బందిపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ హాలులో అధ్యక్షుడు తాటిపాముల సురేష్ కుమార్ మాట్లాడుతూ వైద్యునితో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు రోగుల బాగుకోసమే పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అజయ్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ కళ్యాణ్ కుమార్, వైద్యులు సుధీర్, రమేష్, శ్రీనివాస రెడ్డి, సుజిత్, సురేష్, వేణు బాబు, రాహుల్, రాము, మహేంద్ర నాథ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పనుల ప్రగతి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నాబార్డు నిధులతో చేపట్టిన పనుల ప్రగతిని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర బుధవారం పరిశీలించారు. నాబార్డు ద్వారా అందిస్తున్న పథకాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఆధునిక భవనం, గోదాం, సర్వేపల్లి శివారులోని పెట్రోలు బంకును పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాలకు నాబార్డు కింద నిధులను అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ ప్రగతి పథంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర అన్నారు. అధికారులు సత్యనారాయణ, విష్ణు, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ ఉన్నారు.

అడవిని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

- డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు

రాయికల్, మే 8: అడవిని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అటవీ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో ఉపాధిహామీ కూలీలతో సమావేశమై మాట్లాడుతూ ఇంకుడు గుంతలు తీయడం వల్ల వర్షాకాలంలో నీరు భూమిలోకి ఇంకుతాయని, దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. వర్షాలు పడటంతో పంటలు సమృద్ధిగా పండుతాయని సూచించారు. అడవులను కాపాడుకోవడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, ఉష్ణోగ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ వారి ఇళ్లల్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. అడవిని ఎవరైనా నరికితే అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో ప్రణీత్ కౌర్, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో రవి కుమార్, ఎఫ్‌బీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎస్ చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు పలువురు ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి గోడు వెల్లబోసుకున్నారు. సుమారు గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి వేతనం పెంపుదల జరగడం లేదని వివరించారు. సివిల్ సప్లయి జిల్లా కార్యాలయంలో పీడీఎస్, సీఎంఆర్, ధాన్యం రవాణా, ఎంఎల్ఎస్ పాయింట్ గన్నీస్, గోడౌన్, క్యాషియర్ తదితర విభాగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు జి వంశీ, అరవింద్, మధు, సతీష్, జగన్, సంజయ్, రాంరెడ్డి, శ్రీనివాస్, రాజు, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతీ ధాన్యం గింజ కొంటాం



గంగాధరలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ చౌహాన్

- రైతులకు నష్టం జరగనివ్వం
- ఎలాంటి ఆందోళన చెందొద్దు
- తరుగుపేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు
- పంటకు మద్దతు ధర అందిస్తాం
- రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

గంగాధర, మే 8: అకాల వర్షానికి తడిసిన ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గంగాధర మండల కేంద్రంతో పాటు మధురానగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా కేంద్రాల్లో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోనే ధాన్యం పోసిన రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా, మద్దతు ధర అందుతుందా, అకౌంట్లో డబ్బులు పడ్డాయా అని వివరాలు అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మనోధైర్యం, భరోసా కల్పించేందుకే జిల్లాలో పర్యటిస్తున్నానన్నారు. రైతులకు నష్టం జరగనివ్వమని, ఏలాంటి భయం వద్దని చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులైనా తాము భరిస్తామని రైతులకుఇబ్బంది కలగనివ్వమన్నారు. మిల్లర్లు తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క గ్రాం ధాన్యమైన కోత విధించే అధికారం మిల్లర్లతో పాటు ఎవ్వరికి లేదని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో అధికారులతో సమావేశం నిర్వహించి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతితోను పలు అంశాలపై మాట్లాడానని తెలిపారు. అకాల వర్షం పడే అవకాశం ఉన్నందున వారం రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారీగా ప్రతి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. తేమశాతం సరిగా వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లర్లకు సమాచారం ఇచ్చి ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. ఆ తరువాత తూకం వేసిన ధాన్యం తడిసిన రైతులకు ఏలాంటి నష్టం జరగకుండా చూస్తామని భరోసా కల్పించారు. ధాన్యం బాయిల్డ్ రైస్‌కు ఉపయోగపడుతుందని, మిల్లర్లకు సైతం ఏలాంటి నష్టం కలగదని చెప్పారు. అధికారుల ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని క్లీన్‌చేసి కొనుగోలుకేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధర పొందవచ్చని సూచించారు. అధికారులు ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్, గంగాధర ఏడీఏ రామారావు తదితరులు ఉన్నారు.

● రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

భగత్‌నగర్, మే 8: రైతులకు ఇబ్బందులు రాకుండా తేమ శాతం సరిగా రాగానే ధాన్యాన్ని తూకం వేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సెల్‌నెంబర్‌లు నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది, ఎంత డబ్బు జమ చేశారు అని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ ద్వారా రైతు లచ్చయ్యతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.



మల్యాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న కమిషనర్ చౌహాన్

మల్యాల: అకాల వర్షాలతో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. మల్యాల మండలంలోని రామన్నపేట, మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్ చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయరనే అపోహలు, అనుమానాలు వద్దని రైతులకు నష్టం జరుగకుండా చూస్తామని తెలిపారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తూకం వేయడంతో నష్టపోతున్నామని ఈ సందర్భంగా రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా బస్తాకు 40 కిలోల 600 గ్రాముల కన్నా ఎక్కువ ఏ మాత్రం తూకం వేయకూడదని నిర్వాహకులకు సూచించారు. ఈ విషయాన్ని తాను మిల్లర్ల సమావేశంలో తెలుపుతానని అన్నారు. గతంలో కన్న ముందుగా ఈ సారి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని కొనుగోళ్లు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచుల కొరత లేదని తెలిపారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత ఉందని నిర్వాహకులు తెలపగా అక్కడే ఉన్న పౌరసరఫరాల అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం విక్రయించిన రైతులకు ఫోన్ చేసి ధాన్యం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయా లేదా అని తెలుసుకున్నారు. కమిషనర్ వెంట అడిషనల్ కలెక్టర్ రాం బాబు, డీఆర్డీవో సంపత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, సివిల్‌సప్లయ్ అధికారి వెంకటేశ్వర్‌రావు, మేనేజర్ హతీరాం, డీపీఎం విజయభారతి, మల్లేశం, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏపీవో చిన్న రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి: వేగంగా వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని పౌర సరఫరాలకమిషనర్ డీఎస్ చౌహాన్‌ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి, నేరెళ్ల గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంకిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి డబ్బులు పొందిన రైతుతో కొనుగోలు కేంద్రం నిర్వాహకుడి ద్వారా కమిషనర్ ఫోన్‌చేయించి స్వయంగా మాట్లాడారు. డబ్బులు ఎన్ని రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని, ఏమైనా ఇబ్బందులు ఎదురు అయ్యాయా అని ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కాలేదని సదరు రైతు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధాన్యం సేకరణ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీవో పాపా రావు తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, మే 8: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం పోలీసుల తనిఖీల్లో నగదు పట్టుబడింది. కరీంనగర్‌లో పోలీసులు బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 2లక్షల 9 వేల 6 వందల రూపాయలు నగదు పట్టుబడిందని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. రాజీవ్‌చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తిలక్‌రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ వద్ద సరైనా ఆధారాలు లేకుండా నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదును తదుపరి ప్రక్రియ నిమిత్తం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 58,800 నగదు పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన మోరె విజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ. 58,800 నగదు తీసుకెళ్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న నగదును సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 9.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. తనిఖీల్లో ఎస్సైలు నరేష్ , మన్మధరావు తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు వేరువేరుగా తమ దిచక్ర వాహనాలపై 1.80 లక్షలు, 1.50 లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదుకు ఎలాంటి ఆధారాలను చూపించకపోవడంతో అతని వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకోని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా వ్యాపారరీత్యా లేదా ఆసపత్రితో పాటు ఏదైనా అత్యవసర పరిస్థితిల్లో రూ. 50వేలకు పైగా డబ్బులు తరలిస్తే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు

400 చీరలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మే 8 : కరీంనగర్‌లో పోలీసులు బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలలో 400 చీరలు పట్టుబడ్డాయి. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో వ్యాన్(టీఎస్ 13 ఈబీ 2549)లో సరైన రశీదులు లేని అక్రమంగా తరలిస్తున్న దాదాపు 3 లక్షల రూపాయల విలువ చేసే 400 చీరలతో పాటు ఇతర దుస్తులను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ నుంచి ధర్మపురికి ఈ చీరలు తరలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన చీరలను తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు. విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.



చీరలను పట్టుకున్న పోలీసులు

అక్రమ లేఅవుట్లపై విచారణకు ఐజీ ఆదేశం

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలో ఏడాది కాలంలో ఏర్పాటు చేసి అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల క్రితం జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో అమ్మిన భూముల రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. కాగా నాలుగు రోజులుగా దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విచారణతో నాలా కన్వర్షన్, మున్సిపల్ అనుమతి లేకుండా భూములు కొనుగోలు చేసిన వారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఈ విచారణ జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే ముందస్తుగానే సెలవుపై వెళ్లాడు. దీంతో మరొకరిని సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్న కుంభకోణాలు బయట పడనున్నాయి.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

మెట్‌పల్లి, మే 8: కోరుట్ల ప్రభుత్వ ఆసపత్రిలోని డ్యూటీలో ఉన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల కితం జరిగిన సంఘటనలో డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ప్రతి వైద్యుడు తమ వద్దకు వచ్చిన రోగిని కాపాడాలనే నిబద్ధతో వైద్యం చేస్తారన్నారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఒంటిపై కిరోసిన్ పోయడంతో పాటు దాడి చేయడాన్ని ఐఎంఏ తరుఫున ఖండిస్తున్నట్లు తెలిపారు. వైద్యడిపై దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధి కారులను కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ యూనియన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆనంద్‌బాబు, జాకబ్‌కిరణ్, రమేష్‌రెడ్డి, విద్యాసాగర్, త్రిలోక్, నిర్మల్‌రెడ్డి, పద్మ, త్రివేణి, మానస, సభ్యులు,తదితరులు పాల్గొన్నారు,



ప్రజలు, పార్టీశ్రేణులకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు వస్తున్న ప్రజలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రధాని మోదీ, ఇతర నేతల భారీ కటౌట్లు



సభకు తరలివస్తున్న మహిళలు

ప్రధాని మోదీ సభ

చిత్రమాలిక

వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నాయకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజ య్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రే ణులు సంతోషం వ్యక్తం చేశాయి.



సభకు హాజరైన మహిళలు



సభ వద్ద పోలీసుల బందోబస్తు



సభకు హాజరైన జనం, కార్యకర్తలు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు, కార్యకర్తలు

బండి సంజయ్ హయాంలో అభివృద్ధి శూన్యం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



శంకరపట్నం రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

జమ్మికుంట రూరల్, మే 8: బండి సంజయ్ హయాంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వేములవాడ ఆలయ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ప్రధాని పక్కన ఉండే బండి సంజయ్ నిధులు తీసుకు రావడానికి అవకాశం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మన దేవాలయాల అభివృద్ధి కోసం కేసీఆర్‌తో లేఖ రాయించి కేంద్ర మంత్రికి అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌దాసు, మాజీ టూరిజం డెవ్‌లాప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●శంకరపట్నం: ప్రధాని నరేంద్రమోదీ వేములవాడ రాజన్నకు చిల్లిగవ్వ ఇవ్వలేదని బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి శంకరపట్నంలో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండలాధ్యక్షుడు గంట మహిపాల్, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరుతూ ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకులు, సిబ్బంది ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారని ట్రస్మా మాజీ చైర్మన్, ముఖ్యసలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినోద్‌కుమార్ ఎంపీగా మళ్లీ గెలిస్తే తప్పకుండా ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకులు, సిబ్బందికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ట్రస్మా ప్రతినిధులు రవీందర్, సురేందర్ పాల్గొన్నారు.

●జమ్మికుంట రూరల్: బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు అన్నారు. బుధవారం జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గడప గడప ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్‌రావు పాల్గొన్నారు.

●గంగాధర: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం కాసారంలో ఉపాధిహామీ కూలీలకు మజ్జిక ప్యాకెట్లు, అరటిపండ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వేముల దామోదర్, కంకణాల విజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివశంకర్, నాయకులు మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆదాయాన్ని దారి మళ్లించిన కేసీఆర్

-బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 8: రాజన్న ఆదాయాన్ని దారి మళ్లించిన మోసగాడు కేసీఆర్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని పద్మశాలి భవన్‌లో కరీంనగర్ అసెంబ్లీ స్థాయి బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేములవాడపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. వేములవాడ అభివృద్ధికి ప్రధాని మోదీ హామీ ఇవ్వక పోవడంపై వినోద్‌కుమార్ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. ప్రసాద్‌స్కీం కింద నిధులిస్తాం ప్రతిపాదనలు పంపాలని కోరినా పట్టించుకోని మూర్ఖుడు కేసీఆర్ అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటానన్నారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. ఆలయాల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసిన పట్టించుకోలేదని, ఆ లేఖలను విడుదల చేశారు. వేములవాడ అభివృద్ధికి ఏటా 100 కోట్ల చొప్పున 400 కోట్లు విడుదల చేసి అద్భుతంగా అభివృద్ధి చేస్తామన్నారు. దేవుళ్లకే శటగోపం పెట్టిన 420 నేతలు బీఆర్ఎస్ వారన్నారు. కొండగట్టు, వేములవాడ దేవాలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ రాజకీయాలను పక్కన పెట్టి సహకరించాలన్నారు. కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయాన్ని దేశమంతా చాటి చెప్పేదుకు ప్రధానమంత్రి వేములవాడకు వచ్చారనే విషయాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు విస్మరించడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి లోకల్ కాదు కాబట్టే ప్రసాద్ స్కీం కింద వేములవాడను చేర్చలేదన్నారు. తీగలగుట్టపల్లి ఆర్‌ఓబీ లేక దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వినోద్‌కుమార్ పట్టించుకోలేదని బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆర్‌ఓబీ నిర్మాణం విషయంలో కేంద్రం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఇప్పించలేక పోయారన్నారు. తాను లోకల్ కాబట్టే కరీంనగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి కేంద్రాన్ని ఒప్పించి సేతుబంధన్ స్కీం ద్వారా పూర్తి స్థాయి నిధులు తీసుకు వచ్చి నిర్మాణ పనులు చేపడుతున్న విషయాన్నిగుర్తు చేశారు. అసెంబ్లీ నియోజక వర్గ ఆస్థయిలో బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలపై సూచనలు అందించారు.

●నగరంలోని 23వ డివిజన్‌లో రాష్ట్ర అధికార ప్రతినిధి మొలుగూరి కిషోర్ ఆధ్వర్యంలో బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సుధ, శారద, కొత్తకొండ సంపత్, రాము, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, రమాదేవి, శాంత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

భగత్‌నగర్, మే 8: వేములవాడ ఎన్నికల ప్రచార మోదీ సభకు నగరంలోని 18వ డివిజన్ నుంఇ శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, పింగిలి ప్రతాప్‌రెడ్డి, నాంపల్లి శంకర్, విష్ణుప్రసాద్‌రావు, లక్ష్మీరాజ్యం, గోదరి నరేష్‌మైపాల్‌రెడ్డి, భూమయ్య రమేష్, అనిత, భూపతిరెడ్డి, రజిత, లింబారెడ్డి, నవీన్‌రావు, వంశి, భానుచందర్, చంద్రకాంత్, రవి, రేడియో రాములు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

సుభాష్‌నగర్‌చ, మే 8: వాసవి జాగృతి కార్యక్రమంలో భాగంగా వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమాన్ని బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి జ్యంధం మధుకర్, ఐపీఈ చందా రవీందర్, రీజియన్ చైర్‌పర్సన్ అక్కినపల్లి నాగరాజు, వాగ్దేవి క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, స్వరూప, తిరుపతమ్మ, రాజమణి పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం


పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, మే 8: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో బాలల వేసవి శిక్షణా శిబిరం బుధవారం మంకమ్మతోటలోని పారమిత విద్యాసంస్థలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కరీంనగర్ సెంటర్ ఇన్‌చార్జ్ అక్షయచైతన్య మాట్లాడుతూ ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈనెల 12వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. బాలబాలికలు శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. శ్లోకాలు, నీతి కథలు, భజనలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పూజా విధానం, ఆటలు నేర్పుతారని పేర్కొన్నారు. అనంతరం స్వామీ చిన్మయానంద 108వ జన్మదినత్సవం సందర్భంగా గురుపాదుకా పూజ జరిగింది. కార్యక్రమంలో పారమిత యాజమాన్యం, చిన్మయ మిషన్ అధ్యక్ష కార్యదర్శులు గంప జలేందర్, గజవాడ శ్రీనివాస్, కోశాధికారి అరుణ, రాచకొండ రజనీకాంత్, గరిపెల్లి చంద్రం, చెట్ల రాజేశ్వర్, అరవింద, గజవాడ శ్రీదేవి, రాచకొండ సౌజన్య, చెట్ల సరోజ, నల్ల మహేశ్, అంచూరి రాజయ్య, తొడుపునూరి తిరుపతి, ఆంజనేయులు, శివకృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

హుజూరాబాద్‌రూరల్, మే 8 : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బీఏ(జర్నలిజం), బీఎస్సీ(లైఫ్ సైన్స్), బీకాం(కంప్యూటర్) కోర్సులలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ సెక్రటరి మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు, సెక్రటరి ఇంద్రనీల్, ప్రిన్సిపాల్ వీవీఎన్ హనుమకుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9553219988 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రణవ్‌ను కలిసిన టీవైజేఎఫ్ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్, మే 8: మండలంలోని సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ నివాస గృహంలో తెలంగాణ జర్నలిస్టు ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శేఖర్, బడుగు రవి, కుమార్, ప్రశాంత్, అశోక్, సతీష్, నవీన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారికి కుండవా వేసి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

వీణవంక/హుజూరాబాద్ రూరల్, మే 8: మండలంలోని నర్సింగాపూర్ మాజీ సర్పంచ్ గంగాడి సౌజన్య తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో పార్టీ హుజూ రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘుపాల్ రెడ్డి, పంజాల సతీష్, కొమ్మిడి రాకేష్‌రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, ప్రకాశ్‌రెడ్డి, గిరవేన రవీందర్, సమ్మిరెడ్డి, కొండాల్‌రెడ్డి, నల్ల వెంక టిరెడ్డి, సంపత్‌రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, చింతల రాజిరెడ్డి, కరుణాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నేరెళ్ల రాజమల్లగౌడ్ హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. . కార్యక్రమం లో అశోక్, ఎగ్గటి సదానందం, కాయిత లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సమక్షంలో సుమారు 200మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రణవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల మాజీ సర్పంచు పడాల శంకరయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సాయిరి దేవయ్య, తాళ్ల కుమార్, కోంద్ర సురేష్, నాయకులు ఉన్నారు.

సైదాపూర్: మండలంలోని గొడిశాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ చింత లత-కుమార్ తన అనుచరులతో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు


కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న యువకులు

కరీంనగర్ అర్బన్, మే 8 : ఎంపీగా ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. కరీంనగర్‌లోని కార్ఖనగడ్డకు చెందిన గండి శ్యామ్ తన అనుచరులతో బుధవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌రావు యువసేన అధ్యక్షులు కాసారపు కిరణ్, గండి గణేష్, చిందం శ్రీనివాస్, సరిళ్ళ రతన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన సుమారు పదిహేను కుటుంబాల వారు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కామిరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి రాజేందర్‌రావు కండువా కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

● నగరంలోని పంక్షన్ హాల్‌లో కరీంనగర్ టైలర్స్ అసోసియేషన్ జిల్లా నాయకత్వం వెలిచాల రాజేంద్రరావుకు తమ మద్దతు ప్రకటించారు. మద్దతు తెలిపిన వారిలో టైలర్స్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.భాస్కర్, నగర అధ్యక్షులు ఎన్ రమేష్, కార్యదర్శి రవీందర్, కోశాధికారి రాజు ఉన్నారు.

● వెలిచాల రాజేందర్ రావును మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి నగరంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

●కరీంనగర్ క్రైం: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ భగత్‌నగర్‌లోని శివాలయం వద్ద వెలిచాల రాజేందర్‌రావును గెలిపిం చాలంటూ ఆయన సోదరి వెలిచాల శోభ ఇంటింటి ప్రచారం చేశారు.

●సుభాష్‌నగర్: రాజ్యాంగాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని ప్రజామిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణు గోపాల్ అన్నారు.

●వెలిచాల రాజేందర్‌రావుకే జిల్లా నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య తెలిపారు. బుదవారం నగరంలోని ఐక్యవేదిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

●భగత్‌నగర్: రాజేందర్‌రావును గెలిపించాలని సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్లముకుందరెడ్డి, యు శ్రీనివాస్, ఎడ్ల రమేష్, జి రాజేశం పాల్గొన్నారు.

●కరీంనగర్‌లో రాజేందర్‌రావును గెలిపించాలని ఏఐవైఎఫ్ నాయకులు నగరంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర పాల్గొన్నారు.

●గంగాధర: ప్రజాసంక్షేమాన్ని గంగాధర మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రచారం నిర్వహించారు.

●హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం రాత్రి హుజూరాబాద్‌లో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

●జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని పలు వార్డుల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడప గడప ప్రచారం చేపట్టారు.

●రామడుగు పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 8: కరీంనగర్ మంకమ్మతోట పొన్నం కాంప్లెక్స్‌లోని ఆయన నివాసంలో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మొదట మంత్రి పొన్నం ప్రభాకర్ తన తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా కరీంనగర్ రాజరాజేశ్వరి క్షేత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు.

●మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పొన్నం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వెలిచాల రాజేందర్‌రావు మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

●నగరంలో పలు చోట్ల అన్నదానం, కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు, మార్వాడి మందిర్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు కోడూరు సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్‌కుమార్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, సిరాజ్ హుస్సేన్, సమద్ నవాబ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి రోహిత్‌రావు, బొబ్బిలి విక్టర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్రసత్య ప్రసన్నరెడ్డి, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, కరీంనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: నగరంలోని రెండవ డివిజన్‌లో కాశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తీగలగుట్టపల్లిలోని సహాయ అనాథ పిల్లల స్వచ్ఛంద సంస్థలో బిర్యాని పంపిణీ చేశారు.

●హుజూరాబాద్/జమ్మికుంట/శంకరపట్నం/సైదాపూర్/వీణవంక/మానకొండూర్/తిమ్మాపూర్/రామడుగు/గన్నేరువరం/చొప్పదండి: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 13వ వార్డులో యేముల పుష్పలత ఆధ్వర్యంలో పొన్నం జ న్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో దొంత రమేష్, దేశిని కోటి, సొల్లు బాబు, సందమల్ల బాబు, తిప్పారపు సంపత్ పాల్గొన్నారు జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో మున్సి పల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. శంకరపట్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సైదాపూర్, వీణవంక, మండలంలో, మానకొండూర్ మండల కేంద్రంలో, తిమ్మాపూర్ మండలంలో, రామడుగు మండలంలో, గన్నేరువరం మండల కేంద్రంలో, చొప్పదండిలో ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

-ఎమ్మెల్యే గంగుల కమలాకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ టౌన్, మే 8: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం కరీంనగర్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్ షో నిర్వహిస్తారని, ఈ రోడ్ షోలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీశ్రేణులను కోరారు. బుధవారం ఎమ్మెల్యే తన నివాసంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో కలిసి సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి బస్సులో రాత్రి 6.30 గంటలకు బైపాస్ నుండి రాంనగర్ చౌరస్తాకు చేరుకుంటారని, అక్కడి నుంచి తెలంగాణ చౌక్ వరకు రోడ్ షో నిర్వహించి, తెలంగాణ చౌక్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని అన్నారు. ఈ రోడ్ షోలకు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలను తరలించాలని సూచించారు. ఎన్నికలకు కేవలం కొద్దిరోజులే మిగిలి ఉన్నందున ఈ కీలకమైన సమయంలో గడపగడపకు వెళ్ళి పార్టీ ప్రచారాన్ని విస్తృతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్.రమణ, భానుప్రసాద్‌రావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు పెండ్యాల శ్యామ్ సుందర్‌రెడ్డి, తిప్పర్తి లక్ష్మయ్య, తోట తిరుపతి, సుంకిశాల సంపత్‌రావు, జమీలొద్దీన్, నలువాల రవీందర్ పటేల్, పలువురు సీనియర్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రవణ్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

-మంచిర్యాల చౌరస్తాలో వైద్యుల నిరసన

సుభాష్‌నగర్, మే 8: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ శ్రవణ్ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి, నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు నిరసన వ్యక్త చేశారు. బుధవారం స్థానిక మంచిర్యాల చౌరస్తాలో ప్రభుత్వ, ఐఎంఏ, హెచ్‌ఆర్‌ఈఏ డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్లపై దాడులకు పాల్పడితే వారిపై 2008 సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే పెన్ డౌన్‌తోపాటు, స్టెత్ డౌన్ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజ్‌కుమార్, శరన్‌సాయి, గౌతమ్, శేషశైలజ, చైతన్యరెడ్డి, శ్రీలక్ష్మి, రమణాచారి, విజయ్‌మోహన్‌రెడ్డి, రంజిత్, మహేశ్, చాట్ల శ్రీధర్, లక్ష్మణ్, వడ్డెబోయిన లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, మే 8: లోక కల్యాణార్థం శాతవాహన యూనివర్సిటీ వద్ద గల పివిఆర్ ఫంక్షన్‌హాల్లో ఉత్సవ నిర్వహణ సమితి, యతిరాజ సేవామండలి, వికాసతరంగిణి 148 విద్యానగర్ శాఖ, ఉభయ వేదాంత పండితుడు తూపురాణి శ్రీరమణీరంగాచార్యస్వామి ఆధ్వర్యంలో నవాహ్నిక ఏకకుండాత్మక శ్రీమద్రామాయణ మహాక్రతువులో భాగంగా బుధవారం రాత్రి పండితుల ప్రవచనాలు కొనసాగాయి. రామాయణం-ద్వయార్థ ప్రతిపాదకము అనే అంశంపై భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కొమాండూరి ఇలైవిల్లి స్థలశాయి స్వామి ప్రవచనం చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే గంగుల జన్మదినం

●కరీంనగర్ టౌన్/గణేశ్‌నగర్, మే 8: ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బుధవారం మేయర్ సునీల్‌రావు భగత్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు టి.భానుప్రసాద్‌రావు, ఎల్.రమణ, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

- జేఏసీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె వెంకటనారాయణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

హుజూరాబాద్, మే 8: ప్రజాస్వామ్యం బతకాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. హుజూరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడా రు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక, సామాజిక విధానాలు తిరోగమణ దిశలో ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ సబ్ కా సాత్... సబ్ కా వికాస్ నినాదం అటుకెక్కించి సబ్ కా బక్వాస్ రీతీలో జీఎస్టీ పేరుతో పేదలను నయవంచన చేసి కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని చెప్పారు. దేశంలో 8లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ప్రధాని మోదీ వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి కాపాడలేకపోయారని విమర్శించారు. స్వామినాథ్‌ను కమిషన్ సిఫారస్‌ల మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంపీ అభ్యర్థులు గెలిపించాలని కోరారు. అనంతరం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుం దాం... సామాజిక న్యాయం సాధించుకుందాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్, డాక్టర్ చందా మల్లయ్య, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు పండ్ల పంపిణీ

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సమ్మర్ క్యాంపులో హాకీ నేర్చుకుంటున్న క్రీడాకారులకు బుధవారం ఇండియా హాకీ అడ్వైజర్ కల్యాణిసింగ్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్ధినేని రవీందర్‌రావు, బండ శ్రీనివాస్, కె శ్రీనివాస్, భాస్కర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం మద్దతు కాంగ్రెస్‌కే

గంగాధర, మే 8: కురుమ సంఘం సభ్యులు కాంగ్రె స్ పార్టీకే మద్దతు తెలుపుతున్నట్లు చొప్పదండి నియోజకవర్గ కురువ సంఘం అధ్యక్షుడు ఒగ్గరి మల్లేశం తెలిపారు. బుధవారం ఆయన గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు కురుమ, యాదవ కార్పొరేషన్లు వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లచ్చయ్య, కురుమ సంఘం గౌరవాధ్యక్షులు అయిలయ్య, ప్రధాన కార్యదర్శి గట్టయ్య, మల్లేశం, మల్లీక్, ఓదేలు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

శంకరపట్నం, మే 8: వేములవాడలో నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ బహి రంగ సభకు శంకరపట్నం మండల బీజేపీ శ్రేణులు బుధవారం భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జీ దేవేందర్‌యాదవ్ నాయకులు కొంరయ్య, నరేందర్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.